# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 305 | వరంగల్ | బుధవారం, 09 సెప్టెంబర్ 2026 | పేజీలు: 06






# ఇది సభ కాదు.. దుశ్శాసన సభ

## పోలీసుల దాడులు, ఎమ్మెల్యేల సస్పెన్షన్‌పై గవర్నర్‌కు బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వివాదం మరింత ముదురుతోంది. శాసనసభ సమావేశాల తొలిరోజు పోలీసులు తమపై దాడి చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసి, శాసనసభ వెలుపల చోటుచేసుకున్న పరిణామాలతోపాటు శాసనసభ, శాసనమండలిలో తమకు ఎదురైన పరిస్థితులను వివరించినట్లు తెలిపారు. తమపై జరిగిన దాడికి సంబంధించిన ఫొటోలు, ఆధారాలను గవర్నర్‌కు అందించామని చెప్పారు. 'ఇది సభ కాదు.. దుశ్శాసన సభ' అంటూ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.

- అక్షరశక్తి, హైదరాబాద్

- మహిళా ఎమ్మెల్యేలపై దాడి.. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని ఆరోపణ
- కేసీఆర్ ఇంటిపై దాడికి యత్నం.. సీఎం వెనుక ఉన్నారని కేటీఆర్ ఆరోపణ
- ఏఐ ఫొటోలు, వీడియోలపై ఇప్పటికే ఫిర్యాదు.. జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తాం
- విచారణ జరిపిస్తామని గవర్నర్ హామీ ఇచ్చారని కేటీఆర్ వెల్లడి

5





# ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో రూ.85 లక్షల మోసం

## నకిలీ నియామక ఉత్తర్వులతో నిరుద్యోగ యువతకు టోకరా.. నిందితుడి అరెస్ట్

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగ యువతను నమ్మించి సుమారు రూ.85 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం వసూలు చేసిన వ్యక్తిని కాజీపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన మెట్టు ప్రవీణ్ కుమార్ (41)ను నిందితుడిగా గుర్తించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలో ట్యాక్స్ అసిస్టెంట్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ వంటి ఉద్యోగాలు ఇప్పిస్తానని యువతను నమ్మించి డబ్బులు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. స్పోర్ట్స్ కోటా, ఎన్‌సీసీ కోటా, బ్యాక్‌డోర్ రిక్రూట్‌మెంట్ పేర్లతో అభ్యర్థులను ఆకర్షించిన నిందితుడు, ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన వెబ్‌సైట్లను చూపిస్తూ నమ్మించేవాడని పోలీసులు తెలిపారు. - అక్షరశక్తి,కాజీపేట

4

# ప్రజల గొడవనే తన గొడవగా జీవించిన మహనీయుడు

## ఎర్రబెల్లి దయాకర్ రావు




**అక్షరశక్తి,వరంగల్:** కాళోజీ జయంతి సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ప్రజల గొడవనే తన గొడవగా భావించి జీవితాంతం ప్రజల కోసం పోరాడిన మహనీయుడు కాళోజీ అని అన్నారు. ప్రజా కవిగా, ఉద్యమకారుడిగా స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆయన నిరంకుశత్వం, అరాచక పాలనకు వ్యతిరేకంగా గళమెత్తి ప్రజల్లో చైతన్యం రగిలించారని పేర్కొన్నారు. తెలంగాణ వాడుక భాషలో రచనలు చేస్తూ.. తెలంగాణ భాష బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష అని చాటిచెప్పిన వైతాళికుడు కాళోజీ అని కొనియాడారు.కాళోజీ సేవలను గౌరవిస్తూ అప్పటి కేసీఆర్ ప్రభుత్వం సెప్టెంబర్ 9ను తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించడంతో పాటు కాళోజీ అవార్డును ఏర్పాటు చేసిందని ఎర్రబెల్లి దయాకర్ రావు గుర్తుచేశారు. వరంగల్‌లోని వైద్య విశ్వవిద్యాలయానికి కాళోజీ నారాయణరావు పేరు పెట్టడం, హన్మకొండలో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం చేపట్టడం వంటి కార్యక్రమాలు ఆయనకు దక్కిన గౌరవానికి నిదర్శనమన్నారు. ''పుట్టుక నీది.. చావు నీది.. నీ బ్రతుకంత దేశానిది'' అనే సందేశంతో జీవించిన కాళోజీ, మరణానంతరం తన శరీరాన్ని కాకతీయ వైద్యశాలకు దానం చేయాలని కుటుంబ సభ్యులకు చెప్పి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. కాళోజీ రచనలను తెలంగాణ యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఆయనకు ఘన నివాళులర్పించారు.



# ఆర్ట్స్ కళాశాలలో కాళోజీ జయంతి వేడుకలు

**అక్షరశక్తి,హనుమకొండ:** కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రముఖ ప్రజాకవి, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుంకరి జ్యోతి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై పోరాడిన కాళోజీ భావజాలం నేటి తరానికి మార్గదర్శకమని, యువత సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రెహమాన్, అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# కాళోజీ ప్రజల మనిషి సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



అక్షరశక్తి,హన్మకొండ: తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానానికి కాళోజీ నారాయణరావు నిలువుటద్దమని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. కాళోజీ 112వ జయంతి సందర్భంగా నక్కలగుట్టలోని టీజీఎన్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు, సామాజిక అన్యాయాలపై కాళోజీ తన కలం ద్వారా నిరంతరం గళమెత్తారని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవా దృక్పథంతో పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు, సీఈలు, సీజీఎంలు, జీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య భట్ ప్రతికంఠంకు ఉస్మానియా పీహెచ్‌డీ



**అక్షరశక్తి,హన్మకొండ:** ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన 85వ స్నాతకోత్సవంలో హన్మకొండకు చెందిన డా. ఆదిత్య భట్ ప్రతికంఠం కామర్స్ విభాగంలో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. "అల్గారిథమిక్ ట్రేడింగ్ ప్రభావం-మార్కెట్ అస్థిరత, ధర నిర్ణయం, మార్కెట్ సామర్థ్యం" అనే అంశంపై ప్రొఫెసర్, రిజిస్ట్రార్ CMA డా. గడ్డం నరేష్ రెడ్డి మార్గదర్శకత్వంలో పరిశోధన పూర్తి చేశారు. విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగు రామ్ సమక్షంలో భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డా. కృష్ణ ఎం. ఎల్లా చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను స్వీకరించారు. ఎంపిక చేసిన నిఫ్టీ-50 కంపెనీల్లో అల్గారిథమిక్ ట్రేడింగ్ మార్కెట్ అస్థిరత, ధర నిర్ణయ ప్రక్రియ, మార్కెట్ సామర్థ్యంపై చూపే ప్రభావాన్ని ఆయన పరిశోధనలో విశ్లేషించారు.2021 నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీనియర్ రీసెర్చ్ ఫెలోగా కొనసాగుతున్న ఆదిత్య భట్, అదే విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ (ఫైనాన్స్), గీతం విశ్వవిద్యాలయం నుంచి ఎం.కామ్ (ఫైనాన్స్), ఎం.ఏ. (ఎకనామిక్స్) పూర్తి చేశారు. CMA (USA), CWM (USA), EA, EPAT తదితర వృత్తిపరమైన అర్హతలు సాధించారు. రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్ అండ్ CAD విభాగంలో సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన పి. మహేందర్ రాజు-శ్రీదేవి దంపతుల కుమారుడైన ఆదిత్య భట్, తన పరిశోధన విజయవంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన పరిశోధన మార్గదర్శకులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.


# గణేష్ మండపాల్లో విద్యుత్ భద్రతపై తనిఖీలు

**అక్షరశక్తి,జనగామ:** జనగామ టౌన్1, టౌన్2 పరిధిలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఎస్ఈ సంపత్ రెడ్డి, డీఈ, ఏడీఈలు సంయుక్తంగా తనిఖీ చేశారు. మండపాల నిర్వాహకులకు విద్యుత్ భద్రత, వైరింగ్, కనెక్షన్ల ఏర్పాటుపై సూచనలు చేశారు. షార్ట్ సర్క్యూట్‌లు, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, నాణ్యమైన వైర్లు, రక్షణ పరికరాలు వినియోగించాలని సూచించారు.

4



# పర్యాటక అభివృద్ధికి మూడేళ్ల కార్యాచరణ ప్రణాళిక



**అక్షరశక్తి,హన్మకొండ:** ప్రతి జిల్లాలోని ప్రత్యేక పర్యాటక సామర్థ్యాన్ని గుర్తించి, పర్యాటక రంగ అభివృద్ధికి మూడేళ్ల సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో పర్యాటక అభివృద్ధి, జ్ఞాన భారతం మిషన్ అమలుపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాల సమన్వయానికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని, సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 142 వారాంతపు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడి అవకాశాలు, ప్రచార కార్యక్రమాలను రూపొందించాలని వాణి ప్రసాద్ సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది, సైన్‌బోర్డులు, సమాచార కేంద్రాలు, స్థానిక గైడ్లు, టికెటింగ్, ఆహార కేంద్రాలు, దివ్యాంగులకు అనుకూలమైన సౌకర్యాలు వంటి మౌలిక వసతులను ప్రాధాన్యతా క్రమంలో కల్పించాలన్నారు. పీపీపీ విధానంలో చేపట్టేందుకు అనువైన ప్రాజెక్టులు, ప్రభుత్వ భూములను గుర్తించి, సాధ్యాసాధ్యాల నివేదికలు, ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలని తెలిపారు. సీఎస్ఆర్ నిధులు, ప్రభుత్వ పథకాల అనుసంధానంతోనూ పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు.జ్ఞాన భారతం మిషన్‌లో భాగంగా చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న ప్రాచీన గ్రంథాలు, మాన్యుస్క్రిప్టులను గుర్తించి సంరక్షించడంతో పాటు డిజిటలైజ్ చేయాలని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి తెలిపారు. ప్రతి జిల్లాలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి సమగ్ర సర్వే చేపట్టి నివేదికలు సమర్పించాలని, తెలుగు, ఉర్దూ తదితర భాషల పండితుల వద్ద ఉన్న ప్రాచీన గ్రంథాల వివరాలను సేకరించాలని సూచించారు. జ్ఞాన భారతం మిషన్‌కు జిల్లా అదనపు కలెక్టర్లను నోడల్ అధికారులుగా నియమించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల్లో 16 వారసత్వ ప్రదేశాలను గుర్తించి రూ.8.45 కోట్లతో అభివృద్ధి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ పాల్గొన్నారు.

# ప్రణాళికతోనే పర్యాటక పరిపూర్ణత్వం





**అక్షరశక్తి,హన్మకొండ:** పర్యాటక రంగంలో వివిధ ప్రాంతాల సందర్శనకు ముందుగా సరైన ప్రణాళిక రూపొందించుకోవడం ఎంతో అవసరమని కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర, పర్యాటక నిర్వహణ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వి.ఎస్. నరేందర్ అన్నారు. హన్మకొండలోని పింగళి ప్రభుత్వ మహిళా కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్యాటక సర్టిఫికెట్ కోర్సులో భాగంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ కె.వి.ఎస్. నరేందర్ వనరుల వ్యక్తిగా హాజరై 'పర్యాటక ప్రాధాన్యత మరియు ప్రయాణ పట్టిక రూపకల్పన' అనే అంశంపై విస్తృతంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటకులు ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాలను సందర్శించాలనుకున్నప్పుడు ఆయా ప్రాంతాలను సరైన క్రమంలో ఎంపిక చేసుకుని, ప్రయాణ సమయం, రవాణా సౌకర్యాలు, బస తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందుగానే షెడ్యూల్ రూపొందించుకోవడాన్నే ప్రయాణ పట్టిక (ఇటినరరీ) అంటారని వివరించారు. విదేశీ పర్యటనల సందర్భంలో విదేశీ కరెన్సీ, డాలర్ విలువ, వీసా వంటి అంశాల ప్రాధాన్యతను ఆయన వివరించారు. ఒక దేశంలోని సహజ, చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక తదితర వనరులను పర్యాటక ఆకర్షణలుగా అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చన్నారు. పర్యాటక రంగంలో ప్రయాణ సంస్థలు, ప్రయాణ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. బౌద్ధ ఆరామాలు, చారిత్రక కట్టడాలు, సాంస్కృతిక కేంద్రాలు వంటి వాటిని పర్యాటక ఆకర్షణలుగా తీర్చిదిద్దే విధానాలను వివరించారు. వివిధ ప్రాంతాలను సందర్శించే సమయంలో స్థానిక భాష, స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ స్థానికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగం అనేక దేశాల వనరులను ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రాలుగా మలుచుకుంటూ విస్తరిస్తోందని డాక్టర్ నరేందర్ తెలిపారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ పి. నరేష్, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**అక్షరశక్తి, హనుమకొండ;** ఈ నెల 13వ తేదీన( ఆదివారం) జరగనున్న నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ 2, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ 2 పరీక్ష నిర్వహణకు పరీక్షా కేంద్రాలలో పకడ్బందీ ఏర్పాట్లు ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. బుధవారం హనుమకొండ వడ్డేపల్లి లోని పింగిళి ప్రభుత్వ బాలికల డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో ఎంతమంది అభ్యర్థులకు పరీక్షకు కేటాయించారనే వివరాలను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కోసం కేటాయించిన తరగతి గదులను పరిశీలించారు. కళాశాలలోని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గదిని సందర్శించి పరీక్షకు సంబంధించి వచ్చిన మెటీరియల్ వివరాలను ఎగ్జామినేషన్ ఇన్చార్జి సుహాసిని కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ పరీక్ష నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పరీక్షా గదుల నిర్వహణ, తాగునీరు, విద్యుత్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా కలెక్టరేట్ లోని పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమును కలెక్టర్ పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలను జిల్లా ఖజానా అధికారి శ్రీనివాస్ కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్ కలెక్టర్ కు వివరించారు. హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్డీఏ, నావల్ అకాడమీ పరీక్ష ఈనెల 13న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అదేవిధంగా వడ్డేపల్లి లోని పింగళి ప్రభుత్వ బాలికల డిగ్రీ, పీజీ కళాశాలలో సిడిఎస్ పరీక్ష ఉదయం 9 నుండి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12:30 నుండి 2:30 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు పరీక్ష జరుగుతుందని అధికారులు తెలిపారు.

**తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్...**

పింగిళి ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలను సందర్శించిన కలెక్టర్ కళాశాలలోని తరగతులైన పరిశీలించారు. బీసీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. చదువులు పూర్తయిన వెంటనే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని, సాఫ్ట్వేర్ రంగంలోనూ ఉద్యోగాలు సాధించాలని విద్యార్థినులకు సూచించారు. కళాశాలలో విద్యార్థినుల సంఖ్య, బోధన, బోధనేతర సిబ్బంది వివరాలను, మౌలిక వసతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# కాళోజీ జయంతి సందర్భంగా ఘన నివాళులు




**అక్షరశక్తి, వరంగల్:** ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్ ఘనంగా నివాళులర్పించారు. బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప ప్రజాకవి అని అన్నారు. తన రచనల ద్వారా ప్రజల సమస్యలను, వారి భావాలను ప్రతిబింబించిన మహనీయుడిగా కాళోజీ చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కాళోజీ చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, సామాజిక చైతన్యాన్ని తన రచనల ద్వారా ప్రజల్లో నింపిన కాళోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాళోజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం ఆయనకు అందిస్తున్న గొప్ప గౌరవమని తెలిపారు. యువత కాళోజీ సాహిత్యం, ఆయన ఆశయాలను అధ్యయనం చేసి సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె కిషోర్ కుమార్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,డి ఆర్వో విజయలక్ష్మి,డిపియార్వో ప్రేమలత మరియు కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కెమిస్ట్రీలో విజయ్ కుమార్‌కు డాక్టరేట్



**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం పరిశోధకులు అల్లం విజయ్ కుమార్ డాక్టరేట్ సాధించారు. బుధవారం విజయ్ కుమార్ కు డాక్టరేట్ డిగ్రీ ప్రధానం జరిగినట్లు కాకతీయ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయ్ కుమార్ డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ కి చెందిన విశ్రాంత ప్రొఫెసర్ జి. బ్రహ్మేశ్వరి పర్యవేక్షణలో 'సింథసిస్ ఆఫ్ స్మాల్ హైబ్రిడ్ మాలిక్యూల్స్ ఫ్రమ్ లాసోన్ ఫర్ ఆంటీ క్యాన్సర్ ఎవల్యూవేషన్' (Synthesis of Small Hybrid Molecules From Lawsone for Anticancer Evaluation"' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. హనుమకొండ జిల్లా, పరకాల మండలం, మలకపేట గ్రామానికి చెందిన విజయ్ కుమార్ ను పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అబినందించారు.

# ఘనంగా ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి



**అక్షరశక్తి, హనుమకొండ:** బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ ఆధ్వర్యంలో ప్రజా కవి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిప్రదాత కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ చీఫ్ విప్, మాజీ శాసన సభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ హాజరై కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో ఉన్న కాళోజీ నారాయణరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ సేవలను, తెలంగాణ సమాజం కోసం ఆయన చేసిన పోరాటాన్ని, ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు గారు కేవలం ఒక కవి మాత్రమే కాదని, ప్రజల పక్షాన నిలిచిన గొప్ప ఉద్యమకారుడని అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అసమానతలను, ప్రజల సమస్యలను తన రచనల ద్వారా నిర్భయంగా ప్రశ్నించిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని ప్రజా కవి కాళోజీ నారాయణరావుకు ఘన నివాళులర్పించారు.



## కామ్రేడ్ మావో జెడాంగ్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం

**అక్షరశక్తి, మహబూబాబాద్ :** కామ్రేడ్ మావో జెడాంగ్ 50వ వర్ధంతి సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని బట్టు అంజయ్య స్మారక భవనంలో చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కామ్రేడ్ హలవత్ లింగన్న మాట్లాడుతూ... కామ్రేడ్ మావో జెడాంగ్ ప్రపంచ విప్లవోద్యమంలో చెరగని ముద్ర వేసిన మహా నాయకుడని అన్నారు. పేదలు, రైతులు, కూలీలు, శ్రమజీవుల హక్కుల కోసం ఆయన సాగించిన పోరాటం ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిందన్నారు. అసమానతలు, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని, రైతాంగం-కార్మిక వర్గం-శ్రమజీవుల సమస్యలపై నిరంతర పోరాటాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మావో జెడాంగ్ ఆలోచనలు, పోరాట స్ఫూర్తిని అధ్యయనం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా ఉద్యమాలను విస్తృతం చేయాలని, హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. "కామ్రేడ్ మావో జెడాంగ్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేద్దాం - దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమిద్దాం" అని కామ్రేడ్ హలవత్ లింగన్న అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఫిమేల్ జిల్లా అధ్యక్షులు సామ పాపయ్య వివిధ ప్రజా సంఘాల నాయకులు సురేష్ శంకర్ అలీ ఏకాంబరం మునిత జ్యోతి వెంకటేష్ నరసింహారావు తదితరులు పాల్గొని కామ్రేడ్ మావో జెడాంగ్‌కు ఘన నివాళులు అర్పించారు.

## మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి

**అక్షరశక్తి, హనుమకొండ, సెప్టెంబర్ 9 :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హితాన్ని చాటే విధంగా "మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం కుడా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వినాయక చవితి మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీక అని, అదే సమయంలో ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యతను కూడా గుర్తు చేసే పండుగగా జరుపుకోవాలని అన్నారు. మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించడం ద్వారా భక్తిని చాటడంతో పాటు చెరువులు, నదులు, నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడవచ్చని తెలిపారు. "వినాయకుడిని మట్టితో పూజించి.. అదే మట్టిని ప్రకృతికి తిరిగి అందిద్దాం. మన భక్తి వల్ల ప్రకృతికి హాని కలగకుండా చూసుకోవడం నిజమైన బాధ్యత" అని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే నేటి నుంచే పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించుకోవాలని సూచించారు. పర్యావరణహితమైన వినాయక చవితి నిర్వహణకు ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూడా ప్రాజెక్ట్ ఆఫీసర్ అజిత్ రెడ్డి, ఈఈ భీమారావు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో రూ.85 లక్షల మోసం

- నకిలీ నియామక ఉత్తర్వులతో నిరుద్యోగ యువతకు టోకరా.. నిందితుడి అరెస్ట్



**అక్షరశక్తి,కాజీపేట:** ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగ యువతను నమ్మించి సుమారు రూ.85 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం వసూలు చేసిన వ్యక్తిని కాజీపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన మెట్టు ప్రవీణ్ కుమార్ (41)ను నిందితుడిగా గుర్తించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలో ట్యాక్స్ అసిస్టెంట్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ వంటి ఉద్యోగాలు ఇప్పిస్తానని యువతను నమ్మించి డబ్బులు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. స్పోర్ట్స్ కోటా, ఎన్‌సీసీ కోటా, బ్యాక్‌డోర్ రిక్రూట్‌మెంట్ పేర్లతో అభ్యర్థులను ఆకర్షించిన నిందితుడు, ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన వెబ్‌సైట్లను చూపిస్తూ నమ్మించేవాడని పోలీసులు తెలిపారు. గతంలో జారీ చేసిన ఉద్యోగ నియామక ఉత్తర్వుల్లో పేర్లు మార్చి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, మెమోరాండంలను తయారు చేసి అభ్యర్థులకు చూపించినట్లు తెలిపారు. మోసం బయట పడకుండా మెడికల్ పరీక్షలు, పోలీస్ వెరిఫికేషన్ వంటి ప్రక్రియలు నిర్వహించినట్లు నటించేవాడని పేర్కొన్నారు. ఐసీఏఐలో నిర్వహించే ఓరియంటేషన్, ఐటీ కోర్సులను కూడా ప్రభుత్వ ఉద్యోగ శిక్షణగా నమ్మించి యువతను మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఇప్పటివరకు గుర్తించిన బాధితుల నుంచి రూ.85 లక్షల వరకు నగదు, నాలుగు తులాల బంగారం తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల అసలు విద్యా సర్టిఫికెట్లు, ఉద్యోగ సంబంధిత పత్రాలను కూడా నిందితుడు తన వద్ద ఉంచుకున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.18.22 లక్షల విలువైన నగదు, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో డెల్ ఐ7 ల్యాప్‌టాప్, మారుతి బ్రెజ్జా కారు, రూ.2 లక్షల నగదు, ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్, ఒప్పో స్మార్ట్‌ఫోన్, రెండు కీప్యాడ్ ఫోన్లు, బాధితుల అసలు విద్యా సర్టిఫికెట్లు, ఉద్యోగ సంబంధిత పత్రాలు ఉన్నాయి. నకిలీ నియామక ఉత్తర్వుల తయారీకి ఉపయోగించిన పారదర్శక షీట్లు, ప్లాస్టర్, ఎల్లో హైలైటర్, ఆడిట్ ఐడెంటిటీ కార్డు జిరాక్స్ తదితర వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాజీపేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జే. శ్యామ్ సుందర్ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ మోసంలో మరింత మంది బాధితులు ఉన్నారా, నిందితుడికి మరెవరైనా సహకరించారా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని, ప్రత్యేక కోటా లేదా బ్యాక్‌డోర్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. నియామక నోటిఫికేషన్లు, ఫలితాలు, నియామక ప్రక్రియను సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారిక వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే ధృవీకరించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగానికి షార్ట్‌కట్ లేదని, ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కాజీపేట పోలీసులు సూచించారు.

# రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్

**అక్షరశక్తి,హనుమకొండ:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రెడ్‌క్రాస్ సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్ ఎం. దాన కిషోర్, ఐఏఎస్ ఆదేశాల మేరకు, హనుమకొండ జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయ్ నేతృత్వంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల నిర్వహణకు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి. నవీన్ కుమార్‌ను ఎన్నికల అధికారిగా నియమించారు. బుధవారం రెడ్‌క్రాస్ భవన్‌ను సందర్శించిన ఎన్నికల అధికారి ఎన్నికల సెల్‌ను ప్రారంభించి, జిల్లాలో మొత్తం 9,853 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 9 నుంచి 14 వరకు ఓటర్ల జాబితాను కలెక్టరేట్‌లోని ఎఫ్2 జిల్లా పరిశ్రమల కేంద్రం, రెడ్‌క్రాస్ ప్రాంగణంలో ప్రదర్శించి అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, సవరణలకు సంబంధించిన అభ్యర్థనలను సెప్టెంబర్ 15 సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు. సెప్టెంబర్ 16న ఓటర్ల జాబితా పరిశీలన, ఆమోదం కోసం రాష్ట్ర శాఖకు అప్పీళ్లు సమర్పించే అవకాశం ఉంటుంది. సెప్టెంబర్ 19న ఎన్నికల షెడ్యూల్‌తో పాటు తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. సెప్టెంబర్ 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. సెప్టెంబర్ 25న నామినేషన్ల పరిశీలన, సెప్టెంబర్ 26న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉపసంహరణకు అవకాశం కల్పిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. అవసరమైతే అక్టోబర్ 4న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి, సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, సుబేదారి, హనుమకొండ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఓటర్ల జాబితా కావాల్సిన వారు సెప్టెంబర్ 20 నుంచి రూ.2,000 చెల్లించి పొందవచ్చన్నారు. సెప్టెంబర్ 23 నుంచి ఉదయం 10 గంటలకు రెడ్‌క్రాస్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రతి నామినేషన్‌ను ఇద్దరు అర్హత కలిగిన సభ్యులు ప్రతిపాదించి, సమర్థించాల్సి ఉంటుందని, ఒక్కో అభ్యర్థికి గరిష్ఠంగా రెండు నామినేషన్లు మాత్రమే ఆమోదిస్తామని పేర్కొన్నారు. నామినేషన్ పత్రాలతో పాటు రూ.10,000 నాన్‌రిఫండబుల్ సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన మేనేజింగ్ కమిటీ సభ్యుల ద్వారా జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకోనున్నట్లు బి. నవీన్ కుమార్ వెల్లడించారు.





# ఇది సభ కాదు.. దుశ్శాసన సభ



- పోలీసుల దాడులు, ఎమ్మెల్యేల సస్పెన్షన్‌పై గవర్నర్‌కు బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి.. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని ఆరోపణ
- కేసీఆర్ ఇంటిపై దాడికి యత్నం.. సీఎం వెనుక ఉన్నారని కేటీఆర్ ఆరోపణ
- ఏఐ ఫొటోలు, వీడియోలపై ఇప్పటికే ఫిర్యాదు.. జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తాం
- విచారణ జరిపిస్తామని గవర్నర్ హామీ ఇచ్చారని కేటీఆర్ వెల్లడి

**అక్షరశక్తి, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వివాదం మరింత ముదురుతోంది. శాసనసభ సమావేశాల తొలిరోజు పోలీసులు తమపై దాడి చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసి, శాసనసభ వెలుపల చోటుచేసుకున్న పరిణామాలతోపాటు శాసనసభ, శాసనమండలిలో తమకు ఎదురైన పరిస్థితులను వివరించినట్లు తెలిపారు. తమపై జరిగిన దాడికి సంబంధించిన ఫొటోలు, ఆధారాలను గవర్నర్‌కు అందించామని చెప్పారు. 'ఇది సభ కాదు.. దుశ్శాసన సభ' అంటూ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.

**టీషర్ట్‌లతో నిరసన తెలిపితే అడ్డుకున్నారు**

పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ నిరసన తెలిపిన తరహాలోనే తాము టీషర్ట్‌ల ద్వారా నిరసన తెలపాలని భావించామని కేటీఆర్ చెప్పారు. అయితే ఎమ్మెల్యేలుగా తమకున్న హక్కులను కాలరాస్తూ సభలోకి రాకుండా రోడ్డుపైనే పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా పోలీసులు తమపై వ్యవహరించిన తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళా శాసనసభ్యులపై జరిగిన దాడికి సంబంధించిన ఫొటోలు, ఆధారాలను అందించామని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సునీతా లక్ష్మారెడ్డి చీరను లాగారని ఆరోపిస్తూ, దీనిని 'దుశ్శాసన పర్వం'గా అభివర్ణించారు.

**దాడి చేసి.. మాపైనే నిందలా?**

తమ పార్టీ నాయకులతోపాటు ఇతరులపై దాడికి వెళ్లిన పోలీసులపై ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని కేటీఆర్ ఆరోపించారు. తమపై దాడి చేసి, తిరిగి తమనే బద్నాం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ఈ మొత్తం వ్యవహారంపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరినట్లు చెప్పారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇంటిపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గూండాల మాదిరిగా దాడికి వెళ్లారని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ ఇంటి వద్ద చావు డప్పు కొడుతూ ఆయన చావును కోరే స్థాయికి కాంగ్రెస్ దిగజారిందని మండిపడ్డారు. ఈ వ్యవహారం వెనుక ముఖ్యమంత్రి స్వయంగా ఉన్నారని ఆరోపించారు.

**హైకోర్టు ఆదేశాలనూ పట్టించుకోలేదు**

హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ తమను శాసనసభ, శాసనమండలిలోకి రాకుండా ప్రభుత్వం అడ్డుకుందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వానికి రాజ్యాంగం, న్యాయస్థానాలపై గౌరవం లేదని గవర్నర్‌కు వివరించామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే తమను సస్పెండ్ చేశారని ఆరోపించారు. శాసనమండలి సభ్యులు అనని మాటలను అన్నట్లుగా ఆపాదించి, జరగని అవమానాన్ని జరిగినట్లుగా చిత్రీకరిస్తూ 'దళిత స్పీకర్' పేరుతో కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

**స్పీకర్‌పై గౌరవం ఉంది.. కాంగ్రెస్‌దే అవమానం**

స్పీకర్‌పై తమకు అపారమైన గౌరవం ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీయే 'దళిత స్పీకర్' అంటూ పదేపదే ప్రస్తావిస్తూ ఆయనను అవమానించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సభలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలోనే దానిని 'కౌరవ సభ', 'దుశ్శాసన సభ'గా అభివర్ణిస్తున్నామని చెప్పారు. శాసనసభ వ్యవహారాలకే పరిమితం కాకుండా బయట జరిగిన ప్రతి సంఘటనపైనా తాము ప్రస్తావించిన అంశాలపై విచారణ జరిపిస్తామని గవర్నర్ హామీ ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. గవర్నర్ ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం జరుగుతున్న దౌర్జన్యకాండలో ఆయన జోక్యం చేసుకుంటారని ఆశిస్తున్నామని చెప్పారు.

**జాతీయ మహిళా కమిషన్‌కు వెళ్తాం**

తెలంగాణ ప్రజల తరఫున న్యాయం అడిగి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరినందుకే తమపై దాడులు జరిగాయని గవర్నర్‌కు వివరించినట్లు కేటీఆర్ చెప్పారు. ప్రభుత్వం విడుదల చేసినట్లు చెబుతున్న ఏఐ ఆధారిత ఫొటోలు, వీడియోలపై ఇప్పటికే ఫిర్యాదు చేశామని, తప్పుడు చిత్రాలు, తప్పుడు ఫిర్యాదులను ఉపయోగించే వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణలో తమకు న్యాయం జరగకపోతే జాతీయ స్థాయిలో జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సభా గౌరవాన్ని మంటగలపొద్దు

- స్పీకర్ పదవిని గౌరవించాలి.. అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి
- మహిళా పోలీసుల పట్ల దురుసు ప్రవర్తనపై జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశాం
- కాళోజీ స్ఫూర్తితో అన్యాయాన్ని ప్రశ్నించాలి
- ప్రజాకవి రచనలు నేటి తరానికి దిక్సూచి
- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య





**అక్షరశక్తి, హన్మకొండ:** శాసనసభలో స్పీకర్ స్థాయిలో ఉన్న వ్యక్తిపై అనుచిత, అసభ్య పదజాలం ఉపయోగించడం ప్రజాస్వామ్య విలువలను దిగజార్చడమేనని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 112వ జయంతిని పురస్కరించుకుని హనుమకొండలోని కాళోజీ విగ్రహానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ సేవలను, సాహిత్య ప్రస్థానాన్ని స్మరించుకున్నారు.

అనంతరం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మీడియాతో మాట్లాడుతూ స్పీకర్ ఏ కులం, ఏ మతానికి చెందిన వ్యక్తి అన్నది కాకుండా.. ఆ కుర్చీని, రాజ్యాంగబద్ధమైన పదవిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. అనుచిత పదజాలం ఉపయోగించిన వారు తమ తప్పును తెలుసుకుని కూడా క్షమాపణ చెప్పేందుకు ముందుకు రాకపోవడం విచారకరమన్నారు. ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించాల్సిన అసెంబ్లీలో ఇలాంటి పదజాలానికి తావివ్వడం ఎవరూ హర్షించరని పేర్కొన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్ ఇలాంటి భాషను గతంలో ఎప్పుడైనా ప్రోత్సహించారా? పార్లమెంట్లోగానీ, అసెంబ్లీలోగానీ ఇలాంటి పదజాలం వినడం జరిగిందా? అని ప్రశ్నించారు. తప్పు జరిగితే అంగీకరించి క్షమాపణ చెప్పడం నాయకత్వ లక్షణమని, దాంతో గౌరవం తగ్గదని వ్యాఖ్యానించారు.

**మహిళా పోలీసుల పట్ల అమర్యాదపై చర్యలు తీసుకోవాలి**

మహిళా పోలీసు సిబ్బందితో వ్యవహరించే తీరుపైనా ఎంపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళా కానిస్టేబుల్ అయినా, ఉన్నతాధికారి అయినా ప్రతి మహిళను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. మహిళా పోలీసుల సమక్షంలో కేటీఆర్, హరీష్ రావు చొక్కాలు విప్పడం, ఆందోళన సమయంలో వ్యవహరించిన తీరు తీవ్రంగా అభ్యంతరకరమని పేర్కొన్నారు. "ప్రభుత్వాన్ని ప్రశ్నించాలంటే అసెంబ్లీలో ప్రశ్నించండి.. ప్రభుత్వం సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉంది" అని అన్నారు. ప్రజాధనంతో నడిచే శాసనసభా సమావేశాలను అడ్డుకోవడం, కాలయాపన చేయడం ద్వారా ప్రజలకు ఏమి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. పార్లమెంట్, శాసనసభ వంటి చట్టసభల్లో టీషర్టులపై రాతలు, ప్లకార్డులు వంటి వాటికి నిబంధనల ప్రకారం అనుమతి ఉండదని గుర్తుచేశారు.

**మహిళల భద్రతపై స్పష్టమైన సందేశం అవసరం?**

మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్న సమయంలో, చట్టాన్ని అమలు చేసే మహిళా పోలీసులే రాజకీయ ఆందోళనల్లో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటే భవిష్యత్తులో వారు విధులు నిర్వహించేందుకు భయపడే పరిస్థితి ఏర్పడుతుందని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా సుదీర్ఘ అనుభవం ఉన్న మాజీ మంత్రులు వ్యవహరించే తీరు వారి కార్యకర్తలు, అనుచరులకు కూడా ఆదర్శంగా మారుతుందని అన్నారు. ఈ ఘటనపై తాను జాతీయ మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేసినట్లు డా. కడియం కావ్య తెలిపారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులైన కేటీఆర్, హరీష్ రావులను కమిషన్ ముందు వివరణ కోరాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. తెలంగాణ డీజీపీ, పోలీస్ కమిషనర్, తెలంగాణ శాసనసభ సెక్రటేరియట్, సంబంధిత అధికార యంత్రాంగం కూడా ఘటనను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. "ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీయాలి.. విధానాలను ప్రశ్నించాలి.. ప్రజా సమస్యలపై పోరాడాలి. కానీ ఆందోళనలు కూడా హుందాగా, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ఉండాలి. మహిళలను గౌరవించడం, చట్టసభల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత" అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ ఛాహత్ బాజ్ పాయ్, ఇతర అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ సిబ్బంది సమస్యలపై ఛలో హైదరాబాద్

- 11న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి: అర్చన, శ్రీలత



**అక్షరశక్తి, హసన్‌పర్తి:** కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయడంతోపాటు, జాబ్‌చార్ట్‌కు భిన్నంగా కేటాయించిన నైట్ డ్యూటీలను రద్దు చేయాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (టీయూసీఐ) హసన్‌పర్తి మండల కన్వీనర్ సీహెచ్.అర్చన, కోకన్వీనర్ ఎం.శ్రీలత డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న నిర్వహించనున్న 'ఛలో హైదరాబాద్' కార్యక్రమానికి రాష్ట్రంలోని కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. బుధవారం హసన్‌పర్తి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఛలో హైదరాబాద్ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 495 కేజీబీవీలు ఉండగా 403 కేజీబీవీలు ఇంటర్ వరకు కొనసాగుతున్నాయన్నారు. వంట మనుషులు, స్కావెంజర్లు, స్వీపర్లు, వాచ్ ఉమెన్లు, అటెండర్లు జాబ్‌చార్ట్‌కు మించి పనిచేస్తున్నా కనీసం వారానికి ఒకరోజు సెలవు కూడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంప్యూటర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లను పార్ట్‌టైం పేరుతో నియమించి ఫుల్‌టైం పని చేయిస్తున్నారని, వారికి ఫుల్‌టైం వేతనాలు చెల్లించాలని కోరారు. పాఠశాల, కళాశాలలు ఉన్న కేజీబీవీల్లో ఏఎన్‌ఎంలపై పనిభారం పెరిగిందని, అదనంగా మరో ఏఎన్‌ఎంను నియమించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పనిభారంతో ఇబ్బందులు పడుతున్న అకౌంటెంట్లు, వర్కర్లకు నైట్ డ్యూటీలు కేటాయించడం అన్యాయమన్నారు. ఏపీతో పోలిస్తే తెలంగాణలో కేజీబీవీ సిబ్బందికి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. జీవో 14, జీవో 60లను అమలు చేసి కనీస వేతనాలు చెల్లించాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు**

కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లకు రూ.26 వేల కనీస వేతనం, నైట్ డ్యూటీల రద్దు, వారానికి ఒకరోజు సెలవు, ఖాళీ పోస్టుల భర్తీ, పీఎఫ్, ఈఎస్ఐ అమలు, ఉద్యోగ-ఆరోగ్య భద్రత కల్పించడం, రిటైర్మెంట్ వయసును 65 ఏళ్లకు పెంచడంతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లు లక్ష్మి, రజిత, శ్రీలత, కళ్యాణి, దివ్య, సుమలత, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుందాం

**డీఎస్పీ తిరుపతి రావు**




**అక్షరశక్తి, మహబూబాబాద్ :** గణపతి నవరాత్రి ఉత్సవాలు నిబంధనల మేరకు విజయవంతంగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని డీఎస్పీ తిరుపతి రావు ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. బుధవారం పోలీసు, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తులకు ముందస్తు జాగ్రత్తలు గూర్చి సలహాలు, సూచనలు ఇచ్చారు. క్రమశిక్షణతో పాటు భద్రత, భక్తి శ్రద్ధలతో గణపతి నవరాత్రులను విజయవంతంగా నిర్వహిద్దామని, మంచి పేరు తెచ్చుకుందాం అంటూ మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ మహబూబాబాద్ మున్సిపల్ శాఖ సంయుక్తంగా ప్రజలను కోరుతున్నామని తెలిపారు. త్వరలో జరగనున్న గణపతి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ వారు నిర్వహించిన కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ ఛైర్మన్ జ్యోతి రమేష్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రెండు శాఖల వారు సంయుక్తంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామని జ్యోతి తెలిపారు. గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ముందస్తు జాగ్రత్తల గురించి మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడకుండా అన్ని కమిటీలు సంయుక్తంగా నిర్ణయాలు తీసుకొని ప్రశాంతంగా నవరాత్రులను జరుపుకోవాలని కోరారు. పోలీస్ శాఖ వారు నిరంతరం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేక సిబ్బంది పర్యవేక్షణలో పర్యవేక్షిస్తూ ఉండాలని పోలీస్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు సిఐ, ఎస్ఐలు, మహబూబాబాద్ పట్టణ పలు వార్డుల కౌన్సిలర్లు రాజు, లక్ష్మీనారాయణ , అరుణ జ్ఞానేశ్వర్, పద్మం ప్రవీణ్, నిమ్మల శ్రీనివాస్, గణపతి ఉత్సవాల నిర్వాహకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# సంగెం మండల అధ్యక్షుడిగా ఆగపాటి రాజు

**అక్షరశక్తి, వరంగల్ :** సంగెం గ్రామం ఉప సర్పంచ్ గా సంగెం మండలం ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు ఇటీవల ఎన్నికైన ఆగపాటి రాజు కు గౌడ సంఘం నాయకులు ఘనంగా శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలోఈ కార్యక్రమంలో... మాజీ ఉప సర్పంచ్ కక్కెర్ల శరత్ బాబు ప్రధాన కార్యదర్శి ఆగపాటి శ్రీశైలం డైరెక్టర్లు పులి రాజశేఖర్ నాలం సూరయ్య ఆగపాటి ప్రభాకర్ పులి రమేష్ గారు బోల్లపల్లి రాజు గౌడ సంఘం నాయకులు బొమ్మగాని బుచ్చయ్య పులి సాంబయ్య పులి కొమురయ్య పులి భద్రయ్య ఆగపాటి ఐలయ్య బెల్లంకొండ వీరస్వామి నాతి సాంబయ్య గునిగంటి వేణు నాలం రాములు తదిరులు పాల్గొన్నారు.

# బాలికల వసతి గృహాల్లో సమస్యలపై రిజిస్ట్రార్ పరిశీలన



**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయ బాలికల వసతి గృహాల్లో నెలకొన్న వివిధ సమస్యలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం బుధవారం సాయంత్రం సమీక్షించారు. వసతి గృహాల్లో విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, పారిశుధ్యం, నిర్వహణ, విద్యుత్, ప్లంబింగ్ తదితర అంశాలను ఆయన పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం తన కార్యాలయంలో వసతి గృహాల డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, వివిధ వసతి గృహాల జాయింట్ డైరెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వసతి గృహాల్లో పని చేస్తున్న సిబ్బంది, వెయిటర్లు, మహిళా అటెండెంట్లు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ తదితర సిబ్బంది విధుల నిర్వహణపై సమీక్షించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి గృహాల్లోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో తక్షణమే పరిష్కరించాలని రిజిస్ట్రార్ ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని, ఇదే విధమైన నిర్లక్ష్య ధోరణి కొనసాగితే క్రమశిక్షణా చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. విద్యార్థినులకు మెరుగైన వసతి, సౌకర్యాలు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

# కేడీసీ లో కాళోజీ జయంతి..




**అక్షరశక్తి, హనుమకొండ:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల పేట వరంగల్ లో ప్రజాకవి కాళోజి జయంతిని పురస్కరించుకొని తెలుగు తెలుగు విభాగం మరియు ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన తెలంగాణ భాషా దినోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి శ్రీనివాస్ గారు సభాధ్యక్షత వహించి కాళోజి వ్యక్తిత్వాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత గారు మాట్లాడుతూ అతని కవితలలోని చైతన్యాన్ని మట్టి వాసనను ప్రస్తావించారు. ఈ సందర్భంగా తెలుగు విభాగాంధీ డాక్టర్ నల్ల ప్రభావతి గారు మాట్లాడుతూ కాళోజి జీవితం వ్యక్తిత్వం సాహిత్యాన్ని గురించి కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర్, భగీరథ, రమేష్ , శ్రీధర్, చారి, కృష్ణవేణి, సుస్మిత, శైలజ, గీత, ఆశాజ్యోతి ప్రదీప్ పాల్గొన్నారు.

# నిఖిల్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమం చేపట్టాలి...



**అక్షరశక్తి, హనుమకొండ:** సమాజంలో సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుండే సామాజికవేత్త వేల్పుల నిఖిల్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని మాజీ ప్రభుత్వ చీఫ్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. 31 వ డివిజన్ న్యూ శాయంపేటకు చెందిన వేల్పుల నిఖిల్ జన్మదిన పురస్కరించుకొని బుధవారం దాస్యం వినయ్ భాస్కర్ కేక్ కట్ చేయించి స్వీట్ తినిపెంచి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వినయ్భాస్కర్ మాట్లాడుతూ నగరముకు చెందిన నిఖిల్ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. నిఖిల్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

# సీఎంను కలిసిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

**అక్షరశక్తి, వరంగల్ :** హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పునకు సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు సమాచారం.



Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.